

నాయుడుపేటలో సినీ హీరో మంచు మనోజ్ సందడి

ప్రజాశక్తి-నాయుడుపేట: ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు తనయుడు యువ హీరో మంచు మనోజ్ నాయుడుపేటలో అభిమానులతో సందడి చేశారు. నాయుడుపేట అమరగార్డెన్‌లో ఉన్న వారి పెద్దమ్మ, మోహన్ బాబు పెద్ద భార్య మంచు విద్యావతమ్మ స్మృతి వనం వద్ద ఆమెకు నివాళులర్పించేందుకు నాయుడు పేటకు విచ్చేసిన ఆయనకు అభిమానులు ఘన స్వాగతం ఏర్పాటు చేశారు. పెద్దమ్మకు నివాళులర్పించిన అనంతరం ఆయన అభిమానులతో కలసి పట్టణంలో కాసేపు సందడి చేశారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు.

నకిలీ 'కేళీ'

ఆరంభంలోనే అన్నదాతకు అగచాట్లు
70శాతం విత్తనం నకిలీదిగా గుర్తింపు
నష్టపరిహారమివ్వాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి - దొరవారిసత్రం

రబీ అదునుకు సకాలంలో వర్షం పడింది.. అంతోఇంతో వరి సాగు చేసి సంక్రాంతి పండగ సంబరంగా జరుపుకుందామనుకున్నారు.. అయితే అందరికీ అన్నం పెట్టే అన్నదాత పొట్టకొట్టాలనుకున్నారు విత్తన వ్యాపారులు.. విత్తనాలు కొని నార్లు పోసిన రైతులు 70 శాతం నకిలీవని గుర్తించి లబోదిబోమంటున్నారు. 30 శాతం నారు నాటలేమని, మరోసారి విత్తనాలు కొని వేయాలంటే అదును పోతుందని వాపోతున్నారు. దున్నకానికి, విత్తనాలకు కలిపి ఇప్పటికే ఎకరాకు పదివేలు దాటిందని విలేకరులతో వాపోతున్నారు. ఆరంభంలోనే తమను అప్పుల పాలు చేసిన దుకాణంపై చర్యలు తీసుకుని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని వేనుబాకం గ్రామంలో నకిలీ విత్తనాలతో రైతులు మోసపోయారు. దాదాపు వంద మంది రైతులు నాయుడుపేట పట్టణంలోని శ్రీ జ్ఞాన ప్రసూనాంబ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర సీడ్స్ దుకాణంలో 555 వరి రకం ధాన్యాన్ని రైతులు దాదాపు 500 బస్తాలను కొనుగోలు చేశారు. 400 ఎకరాల్లో నారుమళ్లలో చల్లారు. అయితే నారుమళ్లను పరిశీలించగా నాశిరకం విత్తనాలని గుర్తించారు. దీంతో రైతులందరూ కలిసి దుకాణదారుని నిలదీశారు. దుకాణదారుడు సమాధానం చెప్పకుండా చేతులెత్తేయడం గమనార్హం. దీంతో రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించారు.

మోసపోయాం : వి.బాబు, రైతు

నారు చూస్తే గాని తెలియలేదు. మోసపోయాం. విత్తిన తరువాత నారు చూస్తే 70శాతం పైనే పనికిరాదు. ఇప్పటికే ఎకరాకు పదివేలకు పైగా ఖర్చయ్యింది. 30 శాతం నారు నాటలేం. ఇతర ప్రత్యామ్నాయ పంటలే గతి. ఏమైనా వరిపై పెట్టుకున్న ఆశ ఆదిలోనే ఆవిరైపోయింది.

నష్టపరిహారమివ్వాలి : జి.జనార్ధన్, రైతు

ఐదు ఎకరాలలో నాట్లు వేసేందుకు భూమి దుక్కి దున్ని సిద్ధం చేసుకున్నాం. తీరా నారుమళ్లను పరిశీలించగా నాశిరకమని తేలింది. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. అన్నదాత పొట్టకొట్టాలనుకున్న విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి. నష్టపరిహారం ఇప్పించడమే గాకుండా, ప్రత్యామ్నాయంగా వేసుకోవాల్సిన అపరాలను ఉచితంగా ప్రభుత్వం అందజేయాలి.

చర్యలు తీసుకుంటాం : నాగరాజు, ఎడి, సూళ్లూరుపేట

రైతులు వేసిన 555 వరి రకం 'కేళీ'. రైతులు మా దృష్టికి తెచ్చిన వెంటనే సిబ్బందితో వెళ్లి నారుమళ్లను పరిశీలించాం. విత్తనాలలో తప్ప ఉండటం వల్ల నారుమళ్లలో తేలి ఉంది. నష్టం వాటిల్లిన మాట వాస్తవమే. విత్తన వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తాం.

మునిపిరెడ్డిపల్లి..
దశాబ్దాలుగా రోడ్డు సమస్య - పట్టించుకోని పాలకులు

దళితవాడకు దారెటు...?

ప్రజాశక్తి - పాకాల

'మా రోడ్డులో గుంతలు పడ్డాయి... మరమ్మతులు చేయండి' అంటూ రాష్ట్రమంతా గగ్గోలు పెడుతున్నారు.. అయితే పాకాల మండలం చెన్నుగారిపల్లి పంచాయతీ మునిపిరెడ్డిపల్లి దళితవాడకు వారికి ఊహ తెలిసినప్పటి నుంచి రోడ్డే లేదు.. శతాబ్దాలుగా ఈ దళితవాడలో తరతరాల వారు పుడుతున్నారు.. పోతున్నారు తప్ప.. రోడ్డును మాత్రం వేయించుకోలేకపోతున్నారు.. పాలకుల వద్ద మొర పెట్టుకున్నా తమ గోడు పట్టించుకోవడం లేదన్నది వారి ఆవేదన. ఇప్పటివరకూ వాళ్లు వెళ్లే రోడ్డులో వెళ్లడానికి వీల్లేదని పెత్తందారులు అడ్డుకోవడంతో తాము ఎలా వెళ్లాలంటూ వారు వాపోతున్నారు.

ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో మునిపిరెడ్డిపల్లి గ్రామస్తులకు ఇంటి స్థలాలను కేటాయించి, అర్హులైన వారికి ఇళ్లు కట్టించి ఇచ్చారు. ఇళ్లయితే కట్టించి ఇచ్చారు గానీ రోడ్డును మాత్రం చూపించలేదు. మునిపిరెడ్డిపల్లి గ్రామంలో 30 కుటుంబాల వారు 160 మంది నివసించే చోట పెత్తందారులు ఉండడంతో రోడ్డును వేశారు. అయితే దళితవాడలో 70 కుటుంబాల వారు 500 మంది నివసిస్తున్నారు. అయితే వీరికి మాత్రం దారే లేదు. తాము ఓటర్లు కాదా.. తమను పాలకులు పట్టించుకోరా అని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా తహశీల్దార్ భాగ్యలక్ష్మి దృష్టికి, ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా దాటవేస్తున్నారే తప్ప, తమ సమస్య పరిష్కారం చేయలేదని వాపోతున్నారు.

వెళ్లడానికి వీల్లేదంటూ పెత్తందారులు అడ్డుకుంటున్న రోడ్డు

రెవెన్యూ మ్యాప్ లో ఉన్న దళితుల గ్రామానికి కేటాయించిన రోడ్డు మార్గంలో సమాధులు నిర్మించిన వైనం

మేము ఓటర్లం కాదా.. : బాలరాజు, గ్రామస్తుడు

మా దళితవాడలో ఉండేవాళ్లం ఓటర్లం కాదా.. పెత్తందారులు మాత్రమే ఓటర్లా.. ఊరికి రోడ్డు ఉండటం ఏంటి? వాడకు రోడ్డు లేకపోవడం ఏంటి? పాలకులకు ఎందుకింత వివక్ష. మేం మనుష్యులం కాదా.. తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. పట్టించుకోలేదు.

మా దారిలో సమాధులున్నాయి : కళావతి, చెన్నుగారిపల్లి సర్పంచి

దళితవాడకు వెళ్లే వేరే మార్గంలో సమాధులున్నాయి. పిల్లలు అటువైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. పెద్దలు రాత్రుల్లో రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. దళితుల గ్రామానికి రెవెన్యూ సర్వే ప్రకారం ఉన్న మార్గంలో సమాధులు ఉన్నాయి. ఇపుడు వెళుతున్న దారిలో పెత్తందారులు వెళ్లనీయడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

రోడ్డు సమస్య ఉండటం వాస్తవమే : భాగ్యలక్ష్మి, తహశీల్దార్

దళితులు చెబుతున్నట్లుగా రోడ్డు సమస్య ఉన్న మాట వాస్తవమే. పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అధికారులతో చర్చించి తొందరలో సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

మానమాలలో పెత్తందారుల దాష్టీకం

సంచార జాతుల మహిళలపై దౌర్జన్యం

మాట్లాడుతున్న మహిళలు

ప్రజాశక్తి - ఓజిలి : మానమాల గ్రామంలో అగ్రవర్ణాల దాష్టీకంతో సంచార జాతుల మహిళలపై దౌర్జ న్యానికి పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. సంచార జాతుల మహిళ లపై అగ్ర కులానికి చెందిన నాయకులు అసభ్యకరమైన పదజాలంతో దూషించారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మానమాల గ్రామంలో బుధవారం దాసరి కులానికి చెందిన మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఓజిలి పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు విలేకరులతో మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా క్రితం మానమాల గ్రామానికి చెందిన ఓ నాయకుడు వద్ద స్థలాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. స్థలంలో ఇల్లు నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్నామని తెలిపారు. అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసిన స్థలంలో ఉంటున్న మమ్మల్ని ఇప్పుడు ఉన్నఫలంగా ఈ స్థలం నాది అంటూ వెంటనే ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడ్డమే కాకుండా ఘర్షణలకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ ఆదిలక్ష్మిని వివరణ కోరగా సంఘటనా స్థలానికి వెళ్లి సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని తెలిపారు.

తెల్లవారుజామునే ట్యూషన్‌కు వచ్చి
తిరుపతిలో విద్యార్థులు అదృశ్యం
ప్రత్యేక టీం ద్వారా గాలింపు చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి నెహ్రూ నగర్‌లోని అన్నమయ్య స్కూల్ నందు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఐదుగురు బుధవారం ఉదయం అదృశ్యమైన సంఘటన నగరంలో సంచలనం కలిగించింది. ప్రత్యేక టీం ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు వెస్ట్ సిఐ శివప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

మెహత, మౌనశ్రీ, గుణశ్రీ, అబ్దుల్ రెహమాన్ పదో తరగతి చదువుతున్నారు. అలాగే అతిఫ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ట్యూషన్‌కు వచ్చి ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో ట్యూషన్ దగ్గరకు వెళ్లి అడగ్గా విద్యార్థులను ఇంటికి పంపించేశామని చెప్పారు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల పిల్లల ఇళ్లలోనూ విచారించారు. అయితే పిల్లల ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు వెస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థులు చదువుకుంటున్న ట్యూషన్ వద్దకు వెళ్లి ఉపాధ్యాయులను ఆరా తీశారు. స్కూల్లో సిసి ఫుటేజీలను పరిశీలించగా పిల్లలు ట్యూషన్ నుంచి ఇంటికి వెళుతున్నట్లుగా సిసి కెమెరాల్లోనూ రికార్డయ్యింది. ఆ తరువాత విద్యార్థులు ఎక్కడికెళ్లారో అనేది తెలియలేదు. ఫిర్యాదు ఆధారంగా ప్రత్యేక టీం ద్వారా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళా వర్సిటీలో పలు నిర్మాణాలకు అనుమతులు
- వర్సిటీ పాలకమండలిలో నిర్ణయాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని పలు నిర్మాణాలకు అనుమతులను తీసుకున్నట్లు సిటీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున వెల్లడించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం ఆచార్య దువ్వూరి జమున ఆధ్వర్యంలో ఆన్లైన్లో పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పలు కీలక అభివృద్ధి అంశాల గురించి అకాడమీ అంశాల గురించి చర్చించడం జరిగిందన్నారు. గవర్నర్ జీవోల ఇంప్లిమెంటేషన్, ఇదివరకే జరిగిన కాంటాక్ట్ అధ్యాపకుల నియామకం గురించిన రాటిఫికేషన్, కోర్టు కేసులు, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో రూ.95 లక్షల వ్యయంతో కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణం వంటి పలు కార్యక్రమాలకు అప్రూవల్ తీసుకోవడం జరిగిందని తెలిపారు. రూ.28 లక్షల వ్యయంతో కంప్యూటర్ సెంటర్‌లోని కంప్యూటర్లు నూతనీకరణ ఆధునీకరణ వంటి అంశాలపై కూడా సానుకూలంగా నిర్ణయాలను తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్ర రెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య సావిత్రి, ఆచార్య కృష్ణకుమారి, రిజిస్ట్రార్ ఆచార్య డిఎం మమత, ఫైనాన్స్ ఆఫీసర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డికి అభినందనలు



ప్రజాశక్తి-క్యాంపస్: టీటీడీ డీఈవో డాక్టర్ భాస్కర్‌రెడ్డిని తితిదే ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సమస్యలు, అధ్యాపకుల సమస్యలపై పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా అవగాహన చేసుకుని పరిష్కరించేందుకు డీఈవోగా నియమించడం ఎంతో సంతోకరమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు డాక్టర్ ప్రసాదరావు, జాటోత్ భాస్కర్, డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల శాతం పెంచుదాం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ -2023 కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహన, ఓటర్ల నమోదుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల స్థాయి నుండి మండల, జిల్లా స్థాయి వరకు ర్యాలీలు నిర్వహించినట్లు కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిర్వహించిన ఎన్నికల కమిషన్ స్వీప్ కార్యక్రమ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించగా నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి, డిఆర్ఓ శ్రీనివాసరావు, అర్బన్ తహశీల్దార్ , మునిసిపల్ అధికారులు , బిఎల్వోలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఓటర్ల శాతం పెంచుదాం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించామన్నారు. 18 వయసు దాటిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని అన్నారు. చదువుకున్న యువత అయితే ఓటు హక్కును సక్రమంగా వినియోగించి కావలసిన నాయకున్ని ఎన్నుకో గలుగుతారని అన్నారు. జిల్లాలో అన్ని కళాశాలల్లో 18 వయసు దాటిన యువత నమోదు చేసుకోవాలని అవగాహన సదస్సులు నిర్వహించామని అన్నారు. నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శన , ఓటరుగా నమోదుకు అవకాశం వంటి కార్యక్రమాలకు సంబంధించి ప్రకాశం పార్క్‌లోనూ నిర్వహించామని అన్నారు. ర్యాలీ అనంతరం మానవహారం , తిరుపతి నియోజకవర్గంలోని 265 మంది బిఎల్ఓ లతో సమీక్ష నిర్వహించను న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, ఈడిటి విజయభాస్కర్, డిటి శ్యామోహన్ పాల్గొన్నారు.

కెవిపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వేదికగా ఈనెల 12వ తేదీన జరగబోయే కెవిపిఎస్ జిల్లా ప్రప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్ పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బుధవారం కెవిపిఎస్ కార్యవర్గ సమావేశం జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షుడిగా వ్యాసారపు హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిపల్లి సురేష్, సహాయ కార్యదర్శులుగా రాధమ్మ, వెలివేంద్రం, ఉపాధ్యక్షుడిగా సురేష్, కోశాధికారిగా ఈశ్వరయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానించారు. అనంతరం రెడ్డిపల్లి సురేష్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 ఏళ్ళు దాటిపోతున్నా సమాజంలో కులవివక్ష, అంటరానితనం సమసి పోలేదని వాపోయారు. నేటికీ ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు, దళితుల అభ్యున్నతికి అడ్డంకిగా మారుతున్న కులవివక్ష, అంటరానితనాన్ని రూపుమాపేందుకు కెవిపిఎస్ తరపున పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం మార్పుకు అఖిలపక్షం ఆమోదం

ప్రజాశక్తి -సత్యవేడు : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం మార్పుపై అఖిలపక్షం ఆమోదం తెలిపింది. బుధవారం తిరుపతి జిల్లా సత్యవేడు తహశీల్దార్ సుబ్రమణ్యం రాజకీయ అఖిలపక్షం నేతలతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. గతంలో సత్యవేడు పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. అయితే ఇరుకైన గదులు, తగిన విస్తీర్ణం లేకపోవడంతో పోలింగ్ సిబ్బందికి అసౌకర్యం ఏర్పడుతుందన్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రం మార్పుపై రాజకీయ అఖిలపక్షం నాయకుల అభిప్రాయాలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ప్రస్తుతం కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం నుంచి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించడానికి వివిధ రాజకీయ పక్షం నేతల అభిప్రాయాలు వెల్లడించారు. ఇందులో భాగంగానే హై స్కూల్‌కు పోలింగ్ కేంద్రాన్ని మార్చడం వల్ల తమకు ఎటువంటి అభ్యంతరం లేదని టిడిపి పట్టణ నాయకుడు శివయ్య తెలుపగా, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తే హై స్కూల్‌కు పోలింగ్ కేంద్ర మార్పుకు తమ పార్టీ అనుకూలమని బిజెపి మండలాధ్యక్షుడు మునికృష్ణయ్య స్పష్టం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచాయతీ కార్యాలయంలోనే జరిగాయి. అప్పుడు బిల్డింగ్స్ సౌకర్యం తక్కువగా ఉన్నా ఇప్పుడు నాలుగు బిల్డింగ్ లు ఉండడంతో ఓటర్లకు అందుబాటులో పంచాయతీ కార్యాలయాలు ఉన్నాయని ఆయన అన్నారు. జన సందోహం నిఘా సౌలభ్యంగా ఉన్న ప్రాంతంలోని కార్యాలయంలో జరపాలని సిపిఎం నాయకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమావేశానికి పార్టీకి చెందిన నేతలు గైర్హాజరు కావడం గమనార్హం. ఏదేమైనా పంచాయతీ కార్యాలయం నుంచి హైస్కూల్‌కు పోలింగ్ కేంద్రాన్ని మార్పుకు మెజార్టీ అఖిలపక్షం రాజకీయ నాయకులు ఆమోదించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డిటి రవిచంద్రబాబు పాల్గొన్నారు.

క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లో ఎస్వీయూ అగ్రస్థానం : వీసీ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం "క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్-2023"లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కంటే ముందు వరుసలో ఎస్వీయూ 351-400 స్థానాన్ని సాధించడం పట్ల వీసీ ఆచార్య కె.రాజారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరా జాతీయ పరిశోధన స్థాయి, పరిశోధనా పత్రాల సైటేషన్ సంఖ్య, బోధన, పరిశోధనారంగాల్లో నాణ్యత, ప్రయోజనీయత వంటి వాటిని కొలమానంగా తీసుకొని జరిగిన శాస్త్రీయ అధ్యయనంలో ఎస్వీయూ ప్రతిభ ప్రదర్శించి ఈ ఉత్తమ ర్యాంకు కైవశం చేసుకుందన్నారు. ఆసియాలోని 760 విశ్వవిద్యాలయాల అభివృద్ధి సూచికలను పరిశీలించిన తర్వాత ఎస్వీయూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రథమ స్థానం, ఇండియాలో 44వ ర్యాంకు, ఆసియాలో 351-400 ర్యాంకు పొందినట్లు క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్ సంస్థ ప్రకటించిందన్నారు. వర్సిటీ బోధన, బోధ నేతల సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పూర్తి సహ కారంతో ఈ ఉన్నతమైన ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. అందుకు కారణమైన వారిని ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్య వాదాలు తెలిపారు. భవి ష్యత్తులో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాల యానికి మరిన్ని ప్రపంచస్థాయిలో ఉన్నతమైన టాప్ టెన్ లోని ర్యాంకులు సాధించేందుకు ప్రతి ఒక్కరి సహకారంతో ముందుకు తీసుకెళ్తామని ఉపకులపతి ఆచార్య కె రాజారెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి -బాలాయపల్లి : పొలంలోకి వెళ్లి వస్తాని ఓ వ్యక్తి తిరిగిరాని లోకానికి వెళ్ళిన సంఘటన తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం కాలగంధ గ్రామంలో జరిగింది. మంగళవారం రాత్రి వ్యవసాయ పొలానికి నీళ్ళు పెట్టి వస్తామని వెళ్ళిన వయ్యావూరు రవీంద్ర (33సం) ప్రమాదవశాత్తు మోటరు వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రవీంద్ర వరి నారు మడులకు నీళ్ల పెట్టి వస్తానని వ్యవసాయ పొలంలోకి మంగళవారం వెళ్లడంతో అక్కడ ఉన్న మోటార్ వైర్లు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి అవుతున్నా రాకపోవడంతో ఫోన్‌చేశారు. అయితే ఫోను మోగుతున్నా తీయకపోవడంతో సమీప బంధువులందరూ కలిసి వ్యవసాయ పొలంలోకి బయలుదేరి వెళ్లి వెతికారు. మోటార్ వద్ద కుప్పకూలి మృతి చెందిన రవీంద్రాన్ని చూసి బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. చేతికొచ్చిన కొడుకు కానరాని లోకానికి వెళ్ళాడని ఆయన తల్లిదండ్రులు కంటతడిని చూసి గ్రామంలో ఏడవనివారే లేరు.

రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు 11 తేదీ శుక్రవారం గవర్నమెంట్ ఐటిఐ కళాశాల, పద్మావతి పురం, తిరుపతి(రూరల్) నందు పదవ తరగతి పాస్/ఫెయిల్ నుండి పీజి వరకు ఉత్తీర్ణత అయిన యువతి యువకులకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన14 బహుళ జాతీయ కంపెనీలలో దాదాపు 1000 ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాలో అర్హత సాధించిన యువతీ యువకులకు నెలకు కనీస జీతం 10వేల నుంచి 30వేల వరకు ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 8121585857, 9966601867 నెంబర్లను సంప్రదించగలరు.

'బీపీ మండల్' విగ్రహావిష్కరణకు భూమి పూజ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిగా తిరుపతిలో బీపీ మండల్ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి బుధవారం ఉదయం వైయస్ఆర్ మార్గ్ సర్కిల్ నందు ఘనంగా భూమి పూజ నిర్వహించారు. తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి చేతులు మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పాల్గొని పూజ నిర్వహించారు. భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో బీపీ మండల్ విగ్రహ ఆవిష్కరణ కొరకు భూమి పూజ నిర్వహించామని, ప్రభుత్వం బీసీలకు ఉన్నత స్థానం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ ముద్ర నారాయణ ,50 డివిజన్ల కార్పొరేటర్లు, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్ర రెడ్డి ,టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, అఖిల భారత యాదవ మహాసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగయ్య పాల్గొన్నారు. నవంబర్ 27 తేదీ న విగ్రహావిష్కరణ జరగనుంది.

'శ్రావణ్ వల్ల క్రైస్తవులకు ఒరిగిందేమీ లేదు' : డాక్టర్ ప్రవీణ్

తిరుపతి సిటి : క్రైస్తవ జనోద్ధరణ పేరుతో రాజకీయాలు చేస్తున్న జడ శ్రావణ్‌కుమార్ వల్ల క్రిష్టియన్ కమ్యూనిటీకి ఒరిగిందేమీ లేదని ఆంధ్రప్రదేశ్ క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ యలమంచిలి ప్రవీణ్ అన్నారు. జై భీమ్ భారత్ పార్టీ అంటూ ముందుకొచ్చి క్రైస్తవులకు ఏదో మేలు చేస్తానని మభ్యపెట్టడం హాస్యాస్పద మన్నారు. ఇప్పటికే దళిత బహుజనుల ఉద్ధరణకు బిఎస్పి, ప్రజాశాంతి పార్టీలు కష్టపడుతున్నాయన్నారు. అనేక ఆర్గనైజేషన్స్ ఏఐసిఎఫ్ , క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ , క్రిష్టియన్స్ బిషప్ కౌన్సిల్, ఏపీసీ వంటి ఆర్గనైజేషన్స్ అనేక సంవత్సరాల నుంచి క్రైస్తవుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

డిసెంబర్ 21న జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి-గూడూరు: డిసెంబర్ 21న సీఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా జగనన్న క్రీడా సంబరాలు ఘనంగా జరుగుతాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు వెల్లడించారు. ఈ నెల 11వ తారీఖున శుక్రవారం గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడా పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ నాలుగు రకాల క్రీడా పోటీలకు ఎంపికలు జరుగుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శివప్రకాష్ రెడ్డి, ఎంఈఓ దేవరాజులు రెడ్డి, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, నియోజకవర్గ క్రీడల ఇంచార్జి కరిముల్లా ఖాన్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచండి

విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్

ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరచాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ కోవిడ్ కారణంగా గత రెండు సంవత్సరాలుగా పాఠశాలలో సరిగా జరగకపోవడం వలన విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించడంలో కొంత వెనకబడటం జరిగిందన్నారు. అందువలన ఈ సంవత్సరం నిర్వహించిన 10వ తరగతి ఫైనల్ పరీక్షలలో ఫలితాలు కూడా అంతంత మాత్రమే వచ్చాయన్నారు. దీని కోసం టీచింగ్ అట్ రైట్ లెవెల్ అనే కార్యక్రమం అమల్లో భాగంగా మండలంలోని ఉపాధ్యా యులకు తెలుగు, గణితంలో నాలుగు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు ఎన్.సురేష్, కె.నరసింగ రావు, వి.సుధాకర్ రెడ్డి, కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - దొరవారిసత్రం : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం డివిజనల్ ప్యారా మెడికల్ ఆఫీసర్ మోహన్ రావు కుష్టి వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ 9, 10 ఇంటర్మీడియట్ తరగతి విద్యార్థులకు మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. కౌమార దశలో ఉన్న విద్యార్థులు పౌష్టికాహారంపై శారీర దృఢత్వంపై అవగాహన కల్పించారు. అనంతరం శారీరక పరిశుభ్రత అంతు రోగాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ పార్వతి సిహెచ్ఓ సంపూర్ణమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్ హెచ్‌పి మౌనిక, ఆశ వర్కర్, మంజుల కళాశాల ఏఎన్ఎం, సుమతి తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్యం, సామాజిక విలువలపై...

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యం సామాజిక విలువలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు స్విమ్స్ తిరుపతి కార్డియాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే సరైన మంచి అలవాట్లు పెంచుకోవటం శారీరిక వ్యాయామం చేయటం అలాంటి విధానాలతో మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు.. ఈ కార్యక్రమంలో వి.వీరయ్య, టి.నరసింహులు, కుమార్ వేలు, వాణిశ్రీ, కందేరి శ్రీదేవి, సురేష్, శ్రీనివాసులు, రఘురాం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య అవకాశాలపై ...

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్ఎస్ఐఇఈ-టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ 2022 నవంబర్ 9న ఎస్పిఎమ్ వివి సావేరి సెమినార్ హాల్‌లో " ప్రమోటింగ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ ద కాంటెంపరరీ టైమ్స్ ఇన్ హయర్ ఎడ్యుకేషన్ " అనే అంశంపై ఇంటరాక్టివ్ సదస్సును నిర్వహించారు. ఈ సెమినార్ ప్రధాన వక్త జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఆచార్యులు డాక్టర్ శివాజీ చక్రవర్తి ప్రసంగించారు. డిజైన్ థింకింగ్ అనేది సమస్యా పరిష్కారం శక్తివంతమైన ప్రక్రియ అని, ఇది కస్టమర్ అవసరాలను అర్థం చేసుకోవడంతో ప్రారంభమవుతుందని ఆయన అన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు స్కాలర్స్, సినర్జీ, ఐఐసి సభ్యులు, ఇంక్యుబేట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సుమన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పిచ్చాటూరు : మండలంలోని వైసీపీలో కీలకంగా ఉంటూ అకాల మరణం చెందిన నేతల కుటుంబ సభ్యులకు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ ఆర్థిక సాయం చేశారు. మండలంలోని కీలపూడిలో శ్రీనివాసులు రెడ్డి, వెంగలత్తూరులో అమావాసయ్యలు తక్కువ వయస్సులో గతంలో హఠాన్మరణం చెందారు. వారు పార్టీకి చేసిన సేవలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. బుధవారం ఉదయం కీలపూడికి చేరుకొని శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు రూ.5వేలు, అమావాసయ్య కుటుంబ సభ్యులకు రూ.10వేలను సాయంగా అందించారు. పార్టీ కోసం పనిచేసిన వారిని తప్పక ఆదుకుంటామని సుమన్ భరోసా ఇచ్చారు.

ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని కల్పించాలి

ఎంపీడీవో సింగయ్య

ప్రజాశక్తి - దొరవారిసత్రం : ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న కుటుంబాలకు 100 రోజులు తప్పకుండా పని కల్పించాలని ఎంపీడీవో సింగయ్య అన్నారు. ఆయన బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సిబ్బందితో రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 452 కుటుంబాలకు మాత్రమే 100 రోజులు పని కల్పించడం జరిగిందని, మిగిలిన జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలకు కూడా వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీవో తెలియజేశారు. ఆధార్ మ్యాపింగ్ పెండింగ్‌లో ఉన్న జాబ్ కార్డులన్నింటికి వెంటనే ఆధార్ మ్యాపింగ్ చేయించాలన్నారు. పనుల ముగింపులోనూ, ఏరియా ఆఫీసర్ యాప్ ద్వారా పనులను పర్యవేక్షించుట లోనూ జిల్లా స్థాయిలో దొరవారిసత్రం మండలం మొదటి స్థానంలో ఉంచినందున ఎపిఒ విజయభాస్కర్‌ను, ఇసి మునీంద్రలను ఎంపీడీవో సింగయ్య ప్రత్యేకంగా అభినందించారు.

ఇప్పటికీ పూర్తవ్వని పురిటిపాళెం గ్రామరహదారి

- సంవత్సరాలు గడుస్తున్నా తీరని సమస్య
- పట్టించుకోని పంచాయతీ రాజ్/ మున్సిపాలిటీ అధికారులు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: తిరుపతి జిల్లా గూడూరు మండలంలోని పోటుపాళెం పంచాయతీ లోని పురిటిపాళెం రోటరీ నగర్ గ్రామాల్లో రహదారుల సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గూడూరు గ్రేడ్ ఒన్ మునిసిపాలిటీ లోకి పోటుపాళెం పంచాయతీ వీలైనమైనప్పట్టికీ రోటరీ నగర్ నుండి పురిటీపాళెం గ్రామానికి వెళ్లాలంటే వాహనదారులు, పాదచారులు తీవ్రంగా కష్టపడవలసి వస్తుంది. రోడ్లంతా గుంతలమయంతో, కంకర రాళ్లు పైకి తేలి ఉండడంతో ఒళ్ళుహూనమవుతుందని గిరిజనులు దళితులు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు వస్తే విద్యార్థులు, చిన్న చిన్న ఉద్యోగస్తులు, బతుకుతెరువు కోసం కూలి పనులకు వెళ్లే వాళ్ళు ఇళ్లకే పరిమితమైపోవాల్సి వస్తుంది. పలు దాఫాలుగా ఎంతోమంది అధికారులను ప్రజా ప్రతినిధుల్ని కలిసి తమ సమస్యను విన్నవించుకుని రోడ్డును మంజూరు చేయవలసిందిగా కోరడంతో, 2018 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ పి.ఆర్.ఆర్ (ఎస్.సి. సి) నిధుల ద్వారా, యంసి రోడ్డు 133/0 కి.మీ నుండి పురిటిపాళెం గ్రామం వరకు సుమారు రూ.2కోట్ల 82 లక్షల అంచనాతో తారురోడ్డు నిర్మాణం చేయుటకు అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ఉన్నారు. కాంట్రాక్టరు కొంతమేర పనిచేసి అర్థాంతరంగా నిలిపివేశారు. అప్పటినుండి సంవత్సరాలు గడుస్తున్నా పంచాయితీ రాజ్ అధికారులు గానీ, మునిసిపాలిటీ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి తమకు రోడ్డును పూర్తి చెయ్యాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

శ్మశాన స్థలం రెండెకరాలు కేటాయించాలి

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి -సత్యవేడు, బిఎన్‌కండ్రిగ: స్థానిక బిఎన్‌కండ్రిగలో కెవిపిఎస్ మండల మహాసభ కే.పోలయ్య అధ్యక్షతన మహాసభ జరిగింది. మొదటగా కెవిపిఎస్ జండా ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్ పునయ్య కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ప్రతి దళిత కుటుంబానికి ఐదు ఎకరాలు సాగు భూమి, దళిత కాలనీకి రెండెకరాల శ్మశాన స్థలం కేటాయించాలని జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు చేసినప్పటికీ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దళితులు చైతన్యవంతులై కెవిపిఎస్ సంఘం ద్వారా పోరాటాలు చేసి ప్రభుత్వాల నుండి సంక్షేమ కార్యక్రమాలు ప్రతి దళిత కుటుంబానికి అందేవిధంగా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కెవిపిఎస్ మండల కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్.రమణయ్య, అధ్యక్షుడిగా కల్లూరు పోలయ్య, ఉపాధ్యక్షుడిగా ఎన్.లోకేష్, సుమతి ఎస్ తిరుపాల్ ప్రధాన కార్యదర్శిగా నీరుపాకు సిసింద్రీ కార్యదర్శులుగా డి.సుబ్బయ్య, నాగమ్మ, గురవయ్య, కోశాధికారిగా నీర్పాక్ మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించిన పిసిసిఎఫ్

ప్రజాశక్తి - దొరవారి సత్రం: మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రాన్ని బుధవారం పిసిసిఎఫ్ మధుసూదన్ రెడ్డి వీరితోపాటు తిరుపతి సిసిఎఫ్ నాగేశ్వరరావు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నేలపట్టు పక్షుల కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్కును పరిశీలించారు. సీజన్ సమయంలో చిల్డ్రన్స్ పార్క్‌లో పిల్లలకు అన్ని వసతులు కల్పించండని ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. అనంతరం పక్షులు విడిది చేరిన చెరువు కట్టపైకి వెళ్లి చెరువు కట్టను పరిశీలించారు. పర్యాటకులు పక్షులను వీక్షించే చెరువు కట్టపై ఉన్న యు పాయింటును పరిశీలించి అక్కడినుండి విదేశీ విహంగాలను బైనస్కోప్ ద్వారా తిలకించారు. పర్యాటకులకు పక్షులు వీక్షించే సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కల్పించకూడదని తెలియజేశారు ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్ పండుగపై ప్రభుత్వ నిర్ణయం బట్టి ఉంటుంది మనం అన్నిటికీ సిద్ధంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. జింకల పార్కు ప్రతి ఒక్కటి పర్యాటకులకు వీక్షించే విధంగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఫారెస్ట్ అధికారులకు సిబ్బందికి తెలియజేశారు. వీరితోపాటు సూళ్లూరుపేట వైల్డ్ లైఫ్ డిఎఫ్ఓ పి.సామేలు. నెల్లూరు డిఎఫ్ఓ చంద్రశేఖర్, నెల్లూరు సోషల్ ఫారెస్ట్ డి ఎఫ్ఓ శ్రీనివాసులు, నేలపట్టు ఎఫ్ఆర్ఓ బి.వరప్రసాద్, నాయుడుపేట ఎఫ్ఆర్ఓ రాజేంద్రప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అందరికీ న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అందరికీ న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా న్యాయ సేవా యంత్రాంగం కృషి చేయాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో బుధవారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయమూర్తులతో పాటు పలువురు న్యాయవాదులు, పలు శాఖల అధికారులు, పారా లీగల్ వాలంటీర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బేబీ రాణి మాట్లాడుతూ న్యాయ సిబ్బంది న్యాయ సేవలను గ్రామీణ స్థాయిలోని అట్టడుగు వర్గాలకు సైతం న్యాయంగా అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సత్యవేడు : సత్వర న్యాయమే జాతీయ లోక్‌అదాలత్ లక్ష్యమని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, సత్యవేడు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రాఘవేంద్ర అన్నారు. గురువారం న్యాయమూర్తి రాఘవేంద్ర మాట్లాడుతూ నవంబర్ 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సివిల్ ,క్రిమినల్ కేసులతోపాటు ఇతర నష్టపరిహారపు కేసులను కూడా లోక్ అదాలత్లో పరిష్కరించుకోవచ్చని ఆయన చెప్పారు.

గూడూరు: ఈ నెల 12వ తేదీన జరిగే లోకదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఏడవ అదనపు జడ్జ్ షమీ పర్వీన్ సుల్తానా బేగం పిలుపునిచ్చారు. సమయాన్ని, నగదును ఆదా చేసుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదికగా మారుతుందని అభిప్రాయపడ్డారు. గూడూరులోని కోర్టు ప్రాంగణంలో ఆమె అక్కడికి వచ్చిన కక్షిదారులకు లోక్ అదాలత్ ఉద్దేశాన్ని వివరించారు.

పుత్తూరు టౌన్: అందరికీ అందుబాటులో న్యాయ సేవలు ఉంటాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లీలా శ్యాంసుందరి పేర్కొన్నారు. న్యాయ సేవ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక రాస్ కార్యాలయంలో మండలి న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

గడపగడపకూ వై.రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ మండలం తొర్రూరు పంచాయతీలో బుధవారం నిర్వహించిన "గడపగడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో మంత్రి ఆర్ కే రోజా అన్న రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు, మురికి కాలువలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ, సర్పంచ్ గోవిందస్వామి రెడ్డి, మురళీ మోహన్, వాసుదేవ రెడ్డి, గోపాలకృష్ణ సర్పంచ్, కొప్షన్ మెంబర్ ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నెల్లూరు ఎల్ఐసిలో పనిచేయు రవికుమార్ దాతృత్వంతో గర్భిణులకు భోజనాలు పంపిణీచేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్ ఎం.ఓ శ్రీనివాసులు, డాక్టర్ రాజా చేతులమీదుగా అందజేశారు. జె.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్, రామమోహన్, పురుషోత్తమ రావు, కటకంశ్రీను, ఇబ్రహిం, జగదీష్, చెంచు నారాయణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం డాక్టర్ దేదీప్తి, డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత కలిగిన గర్భిణులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మందులను పంపిణీ చేశారు. కొంతమంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలకు నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ లోన్ యాప్‌లపై అవగాహన

ఎస్ఐ మంజునాథరెడ్డి

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ: నకిలీ లోను యాప్‌ల పట్ల జాగ్రత్త వహించాలని ఆటో డ్రైవర్లకు శనివారం బిఎన్‌కండ్రిగ ఎస్ఐ మంజునాథరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణ, ప్రసన్న, రేగన్, మధు,రమేష్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

గోడ గడియారం వితరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: జువారీ సిమెంట్ డీలర్ శ్రీలక్ష్మీనారాయణ స్టీల్స్ అండ్ సిమెంట్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, జువారి సిమెంట్ ప్రతినిధులు, నేడు పుత్తూరులో వెలిసిన శ్రీకామాక్షి సదాశివేశ్వరాయ దేవస్థానానికి జువారి సిమెంట్ వారి గోడ గడియారాన్ని ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్‌కి అందజేశారు. జువారి సిమెంట్ జోనల్ మేనేజర్ సంతోష్, ఆలయ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుడుచుకుపోతాయి

మాజీ కేంద్రమంత్రి చింత మోహన్

ప్రజాశక్తి -వెంకటగిరి : రానున్న ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుడుచుకుపోతాయని మాజీ కేంద్రమంత్రి చింత మోహన్ జోస్యం చెప్పారు. బుధవారం వెంకటగిరి పట్టణంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రెండు పార్టీలకు యుద్ధం జరుగుతుందని ఆ రెండు పార్టీలు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలేనని తెలిపారు.

బాతులకు వైద్యం, మందులు పంపిణీ

మరణాలపై స్పందించిన పశువైద్య శాఖ

ప్రజాశక్తి -పిచ్చాటూరు: పిచ్చాటూరులో బాతుల మరణాలపై పశువైద్యశాఖ అధికారులు స్పందించారు. బుధవారం బాతులు మరణాలపై స్పందించిన పశువైద్య అధికారి డాక్టర్ మంజుల బాతులు పెంచే స్థలానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మరణించిన బాతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పశు వైద్యాధికారి వెల్లడించారు.

జెడ్పీటీసీ కోలా మృతికి సంతాపం

ప్రజాశక్తి -వెంకటగిరి : మాజీ డిసిసిబి ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి బుధవారం కె.ఉప్పరపల్లి గ్రామంలో వెంకటగిరి జెడ్పిటిసి కోలా వెంకటేశ్వర్లు మృతి చెందడంతో చిత్రపటానికి పూల మాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా మాజీ డిసిసిబి ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ కోలా వెంకటేశ్వర్లు ఆకస్మిక మరణం అటు వైసీపీకి, వెంకటగిరి మండలానికి తీరని లోటని అన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించడం విచారకరమన్నారు. ఆయన వెంకటగిరి మండలానికి చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జయంపు పిఎసిఎస్ అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి, వెంకటగిరి 23వ వార్డు కౌన్సిలర్ ఆటంబాకం శ్రీనివాసులు రెడ్డి, లాలాపేట పిఎసిఎస్ అధ్యక్షులు వెంకట ముని, కోటంబేడు మాజీ సర్పంచ్ వెంకటరమణా రెడ్డి, వైసీపీ నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోలా వెంకటేశ్వర్లు కుటుంబానికి..

ఎంపీ గురుమూర్తి పరామర్శ

ప్రజాశక్తి తిరుపతి(మంగళం): ఇటీవల తిరుపతి నుంచి తన స్వగ్రామం వెళ్తూ మల్రిగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన వెంకటగిరి రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు కోలా వెంకటేశ్వర్లు, దొరేటి రమణయ్య నాయుడు కుటుంబాలను కె.ఉప్పరపల్లి గ్రామంలో స్థానిక శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి తిరుపతి ఎంపీ గురుమూర్తి పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కోలా వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ కోలా వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మరణంతో దిగ్భ్రాంతికి గురయ్యానని, కుటుంబ సభ్యులకి అండగా ఉంటామని చెప్పారు.

వైసీపీ నాయకుడి కుమారుడు మృతికి నివాళి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : నింద్ర మండల కేంద్రం నింద్ర గ్రామానికి చెందిన వైసీపీ జిల్లా మహిళా కార్యదర్శి మేరీ జయరాం రెడ్డి సోదరులు, సీనియర్ వైసీపీ నాయకులు ధర్మారెడ్డి కుమారుడు మణికంఠన్ (42) అనారోగ్యంతో బుధవారం మరణించారు. రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా ఆదేశాల మేరకు మంత్రి సోదరులు వై.రామ్ ప్రసాద్ రెడ్డి మణికంఠన్ మృత దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన క్రియలకు రూ.25,000 ఆర్థిక సాయం అందించారు. హాస్పిటల్ కైన ఖర్చులను కూడా పరిశీలించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నివాళులు వైసిపి నాయకులు శ్యామ్ లాల్. నాయకులు పాల్గొన్నారు.

నేడు శ్రీజ విడి పాల అమ్మకాలు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పాల ఉత్పత్తిదారులకు ఎంతో మన్నికగా భరోసాను కల్పించే శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసింగ్ కంపెనీ మార్కెట్లో రాణించడానికి తనదైన మార్గాన్వేషణలో ముందుకెళ్తోంది. అందులో భాగంగా గురువారం శ్రీజ పాల ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేయడానికి విడిపాల అమ్మకాలను ప్రారంభిస్తున్నట్లు సీఈఓ జయ తీర్థచారి తెలిపారు. స్వచ్ఛమైన ఆవుపాలను ఆటోమేటిక్ వెండింగ్ మిషన్ ద్వారా రూ.45లకే లీటరు పాలను ప్రజలకు అందించే కార్యక్ర మాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రజలు శ్రీజపై చూపించే ఆదరణ ఇలానే కొనసాగించాలని కోరారు.

ఎస్ఎల్ఎస్ఎంపీసీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ వారు తిరుమల తిరుపతి దేవస్థానంతో కుదుర్చుకున్న ఎంవోయూ ప్రకారం పలు పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. ఏడు డ్రైవర్ పోస్టులకు పదవ తేదీ ఉదయం 10 గంటలకు తిరుపతి శ్వేత భవనంలో, 14వ తేదీ మార్కెటింగ్ గొడౌన్‌లో లోడ్, అన్‌లోడ్ చేయడానికి(అన్ స్కిల్డ్) పదిమందికి, మానవ జుట్టు సార్టర్స్ 50 మంది, పరిశుభ్ర కార్మికులు 42 మంది, 15వ తేదీ వేదపరాయనందార్ ఒకరికి, అర్చక ముగ్గురికి, పోటువర్కర్ ఇద్దరికి, పరిచారిక నలుగురికి ఉదయం 10 గంటలకు శ్వేత భవనంలో, 17న ఉదయం ఆరు గంటలకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్సుగా 19 మందికి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో, 19న 10 గంటలకు ఎస్వి సంగీత నృత్య కళాశాలలో డోలు వాయించడానికి ఒకరిని, నాదస్వరం ఒకరిని, సన్నాయి తిరుచునాళ్ళు ముగ్గురికి, శృతి, తాళం ముగ్గురిని, 22న జూనియర్ ఆడిటర్లు, జూనియర్ అకౌంటెంట్లు ఆరుగురికి, అకౌంటెంట్‌లు ఇద్దరికి నియామకపు ఇంట ర్వ్యూలను నిర్వహిస్తామని, తగిన సమయంలో వారి ధ్రువీకరణ పత్రాలను తీసుకొని హాజరుకావాలని కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు తిరుపతి విద్యార్థిని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 10, 11వ తేదీలలో గోవా రాష్ట్రంలో జరగనున్న 42వ జాతీయ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2022 పోటీల్లో తిరుపతికి చెందిన ఎం.అంజన పాల్గొంటుందని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 17 నుండి 19 వరకు పార్వతీపురంలో నిర్వహించిన 42వ ఏపీ జూనియర్ ఆచరి చాంపియన్‌షిప్‌లో అంజన సిల్వర్ మెడల్‌ను సాధించారని కార్యదర్శి వెంకటరమణ తెలిపారు.

11న శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

వర్చువల్ విధానంలో హాజరుకానున్న గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 11న శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో జరగనున్న 2020- 21 సంవత్సరాలకు గాను 19, 20వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ హాజరు కానున్నారని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున తెలిపారు. స్థానిక మహిళా విశ్వవిద్యాలయం సావేరి కమిటీ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ చాన్సలర్ హోదాలో విద్యార్థులకు డాక్టరేట్ డిగ్రీలు, పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నారని వెల్లడించారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి కృష్ణా జిల్లాకు చెందిన ప్రముఖ డ్యాన్సర్ (పద్మశ్రీ అవార్డు గ్రహీత) ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా యునివర్సిటీ రిజిస్ట్రార్ మమతా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డి.మధు జ్యోతి, వర్సిటీ పిఆర్ఓ డాక్టర్ శ్రీరజిని తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి జన్మదిన వేడుకలు

యర్రావారిపాలెంలో..

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలో వైసీపీ నాయకులు, అభిమానులు, సానుభూతిపరులు మండలవ్యాప్తంగా బుధ వారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగానే విఆర్ అగ్రహారం పంచాయతీలో సర్పంచ్ రాయవరం వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో భారీ కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సర్పంచ్ వెంట పల్లూరు వైసీపీ నాయకులు తరలివచ్చారు.

తిరుచానూరు: చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలను తిరుచానూరు సర్పంచ్ కే.రామచంద్ర రెడ్డి ఘనంగా నిర్వహించారు. బుధవారం పంచాయ తీలోని సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి, ఏఎన్ ఎంలకు, వాలంటీర్లకు పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంచి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నవజీవన్ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుచా నూరు ఎంపిటిసి నరేష్ రెడ్డి, బ్రాహ్మణ పట్టు ఎంపీటీసీ యోగానంద రెడ్డి తిరుచానూరు పంచాయతీ వార్డు మెంబర్లు మునీంద్ర, వాసు, చంద్ర శేఖర్, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

చిన్నగొట్టిగల్లు: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో చిన్నగొట్టిగల్లు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపిపీ బాలం యుగందర్ రెడ్డి, మాజీ డిసిఎమ్మెస్ ఛైర్మన్ సామకోటి సహదేవ రెడ్డి, సర్పంచ్‌లు మనోహర్, విజయకుమార్, దేవప్రసాద్, నాయకులు మహేందర్ రెడ్డి, తవ్వాండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి పాల్గొని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

క్యాంపస్ : ఎంతో ప్రజాభిమానాన్ని చూరగొన్న నాయకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఎస్వీ యూనివర్సిటీలో వైయస్సార్ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ ఓబుళరెడ్డి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మోహిత్ రెడ్డి భారీ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉద్యోగులకు మిఠాయిలు పంచి, టపాసులు కాల్చారు.

తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళం పరిధిలోని తిరుమల నగర్, సప్తగిరి కాలనీ, రణధీరపురం, మంగళం గ్రామపంచాయతీలలో సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వార్డు మెంబర్లు కలసి ఘనంగా నిర్వహించారు. తిరుమల నగర్ పంచాయతీలో వైసిపి ఇన్చార్జ శివశంకర్ రాజు ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్ వసంతు అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దాదాపుగా 109 మంది స్వచ్ఛంధగా రక్తదానం చేశారు. రణధీరపురం గ్రామపంచాయతీలో పంచాయతీ వైసిపి ఇంచార్జ్ పీఎం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వెయ్యి మంది స్థానిక ప్రజలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

తిరుచానూరులో..

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నాయుడుపేట: ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకుని మెరుగైన సమాజం కోసం యువత కృషిచేయాలని తహాశీల్దార్ రాజేంద్ర తెలియజేశారు. బుధవారం ఉదయం నాయుడు పేట పట్టణంలోని తుమ్మూరు నుంచి తహాశీల్దార్ రాజేంద్ర, ఎంపీడీఓ శివప్రసాద్, ఎంఈఓ కోమలాదేవి, హెచ్ఎం దొరస్వామిలు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపిడివో, ఎంఇఓలు మాట్లా డుతూ ఓటు అనేది యువత చేతిలోని ఆయుధమని ఓటు ద్వారా ఒక మంచి సమాజాన్ని నిర్మించుకునే అవకాశం ఉందని తెలియజేసారు.

పెళ్లకూరు : మండలంలోని పెళ్లకూరు గ్రామంలో పెళ్ళకూరు మండల రెవెన్యూ అధికారి కట్టారి జయజయరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రెవిన్యూ ఇన్స్పెక్టర్ సంతోషి భాయ్, శ్రావణ్ కుమార్ ,వీఆర్వోలు, వీఆర్ఏలు ప్రజలు పాల్గొన్నారు.

బాలాయపల్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఓజిలి : మండలంలో తహాశీల్దార్ డీ.లాజరస్ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఓటు హక్కు నమోదుపై అవగాహన ర్యాలీని విద్యార్థులతో నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారిని శైలజ , డిప్యూటీ తాసిల్దార్ పవన్ కుమార్, ఆర్ ఐలు,విఆర్వోలు, సచివాలయం సిబ్బంది, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి: ఓటు విలువను ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు తెలుసుకోవాలని ఇన్ చార్జి తహాశీల్దారు అజిముతుల్లఖాన్ అన్నారు. బుధవారం మండల కార్యాలయం నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ఓటర్ల అవగాహన ర్యాలీ ఎంపీడీఓ వినోద్ కుమార్ ఆద్వరంలో నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాళ్లకి సచివాలయం సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఓటు విలువ తెలిసే విధంగా పలు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

ఓజిలిలో..